

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 14 | సంచిక : 03 | నవంబర్ 2008



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


హైదరాబాద్ ......... 23-09-08

గుండుగొలను ...... 09-03-08

శృంగవృక్షం .......... 01-10-08

జిన్నూరు .............. 09-10-08



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-08, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రపంచంలోనికి మనందరం వచ్చి ఎన్నో విషయాలు నేర్చుకొంటున్నాము. సైన్సుకు సంబంధించిన విషయాలు, లౌకిక విషయాలు ఇలా అనేక విషయాలు నేర్చుకొంటున్నాము కాని వాటితోపాటు మనలో ఉన్న అజ్ఞానాన్ని ఎలా పోగొట్టుకోవాలో నేర్చుకోవటంలేదు. మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటానికే భగవంతుడు మనలను ఈ భూమిమీదకు పంపాడు. మనం వచ్చిన పని మర్చిపోయి, మిగిలిన విషయాలు ఎన్నో నేర్చుకొంటున్నాము. మనకు పొట్ట ఉంది కాబట్టి దానిని పోషించుకోవటానికి ఏవో విద్యలు నేర్చుకొంటున్నాము. అవన్నీ విద్యలే అయినప్పటికీ అవి అనిత్యమైన విద్యలు. ఆత్మవిద్య మాత్రమే నిత్యమైనవిద్య. నిత్యమైనవిద్య నేర్చుకోవటం వలన మన హృదయంలో ఉన్న నిత్యపదార్థం, సత్యపదార్థం మనకు అనుభవంలోనికి వస్తుంది. మనం ఈ భూమి మీదకు వచ్చాక శరీరం సుఖపడటానికి చాలా ప్రక్రియలు కనిపెడుతున్నాము. రైళ్ళు, విమానాలు కనిపెట్టాము పూర్వం ఆదిశంకరాచార్యులవారు భారతదేశం అంతా మూడుసార్లు కాలినడకన తిరిగారు, ఇప్పుడు మనం ఒక ఫర్లాంగు దూరం కూడా నడవలేకపోతున్నాము. ఆచార్యులవారు మన దేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి మన సంస్కృతిపట్ల గౌరవం పెరిగేలా చేసారు, ఆయన బోధస్వరూపుడు. మనకు దైవభక్తిలేదు, దేశభక్తిలేదు. మన జాతీయగీతాలే మనకు రావు. మన దేశభక్తి స్థాయి అలా ఉంది. మన సంస్కృతి మీద మనకు గౌరవం ఉంటే మనకు దేశభక్తి వస్తుంది. దేశభక్తి

వలన మన హృదయం విశాలమవుతుంది. దేశం కూడా మనకు తల్లితో సమానము. మనకు కన్నతల్లి, స్వదేశం, పరాశక్తి అని ముగ్గురు తల్లులు ఉన్నారు. ముగ్గురు తల్లులు మనకు గౌరవనీయులే. మనకు తల్లిమీద, దేశం మీద, సంస్కృతిమీద గౌరవం లేదు. చైనా, జపాన్ దేశాలలో ఏదైనా వస్తువు తయారైతే దానిమీద వారి భాషలో జపాన్‌లో తయారయ్యిందని, చైనాలో తయారయ్యిందని వ్రాసుకొంటారు. మన దేశంలో తయారైన వస్తువులమీద మనం జాతీయభాష అయిన హిందీలోగాని, మన భాష అయిన తెలుగులో గానీ వ్రాసుకోవటం మానేసి ఇంగ్లీషులో వ్రాస్తున్నాము. సైన్స్, టెక్నాలజీలలో ఎంత అభివృద్ధి అయినా వారి సంస్కృతి, భాష, సాంప్రదాయాలమీద వారు గౌరవం విడిచిపెట్టలేదు. సైన్స్, టెక్నాలజీలలో అభివృద్ధి అయ్యాక మనం మన భాషను, సాంప్రదాయాన్ని మరిచిపోయాము. మన సంస్కృతి మీద మనకు గౌరవం ఉంటే అదే దేశభక్తిగా మారుతుంది.

నన్ను నేను ప్రేమించుకొంటాను, మిమ్మల్ని మీరు ప్రేమించుకొంటారు దానికి కారణం అక్కరలేదుకాని నేను మిమ్మల్ని ప్రేమించాలన్నా, మీరు నన్ను ప్రేమించాలన్నా కారణం ఉండాలి లేకపోతే ప్రేమించలేము. ఇది మన బుద్ధిలో ఉన్న దోషం, ఆ దోషాన్ని తొలగించుకోవటానికే మనం ఈ భూమిమీదకు వచ్చాము. ఈ ప్రపంచంలో మనం ఎంతో కాలం ఉండము. రానున్నది రాకమానదు, కానున్నది కాకమానదు, అది ఈశ్వరుడి నిర్ణయం. మన సంకల్పం అంటే మనందరకు ఇష్టం. మనకు భగవంతుడి సంకల్పం పట్ల గౌరవం లేదు. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఆ గోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు. ఈశ్వరుడు మనకంటే తెలివైనవాడు, సర్వజ్ఞుడు అన్న సంగతి మనం మరిచిపోయాము, దేవుడికంటే నేనే తెలివైన వాడిని అనుకొంటున్నాము, ఇదే మన అశాంతికి, దుఃఖానికి కారణం. మనకు తెలిసిన విషయాలు చాలా తక్కువ, తెలియని విషయాలు చాలా ఉన్నాయి. భగవంతుడికి తెలియని విషయం అంటూ ఏమీలేదు. భగవంతుడు ఈ తప్పు చేసాడు, ఆ తప్పు చేసాడు అని అంటాము. భగవంతుడు తప్పు చేయడు. భగవంతుడు చేసింది మనకు నచ్చక అలా అనుకొంటాము. ఈ జీవితంలో జరిగే సంఘటనకు మీ పూర్వజన్మకు ఏదో అనుబంధం ఉంటుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు సంసారం కాదు. పుట్టటం, చనిపోవటం అది సంసారం.

మీరు నన్ను మీటింగులు పెట్టి చెప్పమంటున్నారు, ఏమి చెప్పమంటారు? మౌనం బంగారం, మాటలు వెండి. మౌనంతో మీరు సంతృప్తి పడటం లేదు, మాటలు చెప్పండి

అంటున్నారు. నా దగ్గర ఒకే ఒక్క వాక్యం ఉంది చెప్పటానికి అంతకంటే ఏమీ లేదు. శరీరం సుఖపడటానికి మీరు అనేక ప్రక్రియలు చేసుకొంటున్నారు. శరీరం తాత్కాలికమే అయినా, శరీరం చనిపోయే వరకు అది ఉండాలి కనుక అది కంఫర్టుగా ఉండటానికి తగిన పనులు చేసుకొంటున్నారు, అది మంచిదే. నేను చెప్పేది ఒక్కటే. మీరందరు లోకంలో వస్తువులు, విషయాలు ఎలా సంపాదించుకొంటున్నారో అలాగే ఈశ్వరుని ప్రేమను, అనుగ్రహాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయండి, అంతకంటే చెప్పటానికి ఏమీలేదు. పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయన దయ ఉంటే మనకు అన్నీ ఉన్నట్లే. పరమేశ్వరుడి దయలేకపోతే నీకు బాహ్యంగా ఎన్ని ఉన్నా నీకు ఏమీ లేనట్లే. అందుచేత మనం అందరం కష్టపడి, నిరంతరం కృషిచేసి భగవంతుడి ఆశీస్సులు సంపాదించటం తప్ప మనకు ఇంకొక పనిలేదు, అదే ముఖ్యమైన పని. కాని మనం ఆ పని వదిలేసి మిగతా పనులన్నీ చూసుకొంటున్నాము. దాని వలన మరణానంతర జీవితంలో మనం చాలా నష్టపోతాము. తాత్కాలికంగా ఈరోజు గడిచిపోతే చాలు, ఈ జన్మ గడిస్తే చాలు అని ఇలా కురచగా ఆలోచిస్తున్నాము. కాని మనలో ఉన్న అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవాలి, వ్యక్తి భావనను ఎలా పోగొట్టుకోవాలి అవి మాత్రం నేర్చుకోవటం లేదు.

మన మనస్సు మంచిది కాదు అని అనుకోవటంకంటే దానిని బాగుచేసుకోవాలి. వేరుబుద్ధి నశించేవరకు మనకు ఏదో కోపం, కోరిక, అసూయ, ద్వేషం వస్తూ ఉంటాయి, ఇలా మన బుద్ధిని పాడుచేసుకొంటాము. మన బుద్ధిని బాగుచేసుకోవటానికి మనం ఈ లోకంలోనికి వచ్చాము. బాగా సారా తాగినవాడు కారును ఎలా నడుపుతాడో మన బుద్ధి పాడైపోతే అది మన శరీరాన్ని అలా నడుపుతుంది. మీరు ఒక్కరే ఒంటరిగా ఉన్నప్పుడు ఉన్నట్లుగా పది మందిలో ఉన్నప్పుడు ఉండరు, ఏవో బట్టలు సర్దుకొంటారు, అవి సర్దుకొంటారు. దానికి కారణం వారువేరు, మనంవేరు అని అనుకోవటం. ఆ వేరుబుద్ధి నశించేవరకు ఎవరికీ మోక్షంరాదు, శాంతిలేదు. ఎన్నికలలో కొంతమంది రాజకీయనాయకులు కోట్ల డబ్బు ఖర్చుపెట్టి బిందెలు, చీరలు, కుంకుమ భరిణలు ఇలా ఏవో పంచిపెడుతూ ఉంటారు, మనం వాటిని తీసుకొంటాము. అలా తీసుకొనేటప్పుడు వారు ఎందుకు పంచిపెడుతున్నారు అనే ఆలోచన మనకు ఉండదు, మనకు డబ్బే ప్రధానం, వారికి అధికారం ముఖ్యం. డబ్బు ఖర్చుపెట్టి అధికారంలోనికి వచ్చాక వాడు డబ్బు తినకుండా ఉండడు. వారు డబ్బు ఇచ్చేటప్పుడు మనం తీసుకొంటాము కాని వారు నీతిగా, నిజాయితీగా ఉండాలనుకొంటాము. వారు ఏదో పొరపాట్లు

చేస్తున్నారు అనుకొంటాము గాని మనది కూడా పొరపాటే. ఇవన్నీ ఎందుకు చెపుతున్నాను అంటే లోకానికి సంబంధించిన విషయాలలో కూడా మన జడ్జిమెంట్ సరిగా లేదు.

మనందరికి తలంపులు వేరు, ఆలోచనలు వేరు, వేరువేరుగా ఉన్నాము కాని భగవంతుడు అందరి హృదయాలలో చైతన్యముగా, ఆత్మగా ఉన్నానని చెప్పాడు, మన దేహాలు, మనస్సులు వేరుగా ఉన్న లోపల ఉన్న సద్వస్తువు ఒక్కటంటే ఒక్కటే. నాలో ఉన్నది నేనే, నీలో ఉన్నది కూడా నేనే అనే అనుభవం మనకు వచ్చేవరకు ఎంతమంది మహర్షులు, మహాత్ములు చెప్పినా మనకు భయం పోదు. బుద్ధి జడంలో నుండి రాలేదు, బుద్ధిని భగవంతుడు ఇచ్చాడు. భగవంతుడు ఇచ్చిన బుద్ధిని తిరిగి ఆయనలో ఐక్యం చేసేవరకు ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే, మరణించిన తరువాత పుణ్యలోకాలకో, పాపలోకాలకో కర్మానుసారం ప్రయాణం చేయవలసిందే. ఈశ్వరుడి పట్ల విశ్వాసం లేనప్పుడు, గౌరవం లేనప్పుడు ఆయన దయను సంపాదించటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తాము. తపస్సు చేయకుండా మనలో ఉన్న దోషాలు బయటకు పోవు. వాక్కుతపస్సు, శారీరకతపస్సు, మానసికతపస్సు ఈ తపస్సులు అన్నీ భగవంతుడు చెప్పాడు. ఈ తపస్సుల వలన మన బుద్ధిలో ఉన్న దోషాలు బయటకు పోతాయి. తపస్సు లేనివాడు పతనమైపోతాడు. ఎవరైతే సాధన చేయకుండా లోకాభిరామాయణంతో సరిపెట్టుకొంటున్నారో వారు ఆ జన్మకు ఆ జన్మ పతనమైపోతారు, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి. భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. నీవు ప్రయత్నం చేయకుండా నీకు భగవదనుభవం కలుగదు. నిన్ను నీవు పాడుచేసుకోవద్దు, నిన్ను నీవు బాగుచేసుకో, ఎవరో వచ్చి నిన్ను బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు.

శబరి పెళ్ళికి మాంసాహారంతో భోజనాలు పెట్టటానికి అన్నీ రెడీ చేస్తారు. ఈ హడావుడి ఏమిటి అని శబరి అడుగుతుంది. రేపు నీ పెళ్ళి కదా ఈ మేకలను, గొర్రెలను కోసి బంధువులకు భోజనాలు పెడతారు అని చెప్పారు. నాకు పెళ్ళి అయితే వాటి ప్రాణాలు తీయటం ఏమిటి అని శబరి అడుగుతుంది, ఇదేం పెళ్ళి అంటుంది. ఆ మేకలను, గొర్రెలను బతికించటంకోసం ఆ రాత్రి అందరూ పడుకొన్న తరువాత శబరి ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. కొంతమందికి వాళ్ళ గురించి ఆలోచించుకోవటం ఎలాగో తెలియదు కాని ఇతరుల గురించి నిరంతరం ఆలోచిస్తారు. శబరి ప్రయాణం చేసి మాతంగమహర్షి ఆశ్రమం చేరుకొంది, పూర్వపుణ్యం ఆవిడను అలా తీసుకొని వచ్చింది. కొంతకాలం ఆ మహర్షికి సేవ చేస్తుంది. ఒకరోజు మాతంగముని శబరితో రేపు నేను వెళ్ళిపోతున్నాను అని చెపుతాడు. మీరు వెళ్ళే దగ్గరకి

నన్ను కూడా తీసుకొని వెళ్ళండి అంటుంది శబరి. నేను వెళ్ళేచోటు ఏ ఇద్దరూ కలిసి ప్రయాణం చేసేది కాదు అని మహర్షి చెపుతాడు. మరి నా మాట ఏమిటి అని శబరి అడుగుతుంది. నీవు పుణ్యాత్మురాలవమ్మా! నాకంటే నీవు అదృష్టవంతురాలవమ్మా! మేము భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము, నువ్వు ప్రయత్నం చేయనక్కరలేదు దేవుడే నీ దగ్గరకు వస్తాడు, నువ్వు ఈ ఆశ్రమం విడిచిపెట్టి ఎక్కడకీ వెళ్ళవద్దు, భగవంతుడైన శ్రీరామచంద్రుడే స్వయంగా నీ దగ్గరకు వచ్చి నీకు మోక్షం ఇస్తాడు అని శబరితో చెపుతాడు. అది శబరి యొక్క పుణ్యం. పైకి శరీరం మామూలుగా మనకు కనిపిస్తుంది కాని లోపల ఉన్న నిర్మలత్వం, శాంతి, జ్ఞానం యొక్క వైభవం జ్ఞాననేత్రం ఉంటేనే కాని చూడలేము. మీలో హృదయసౌందర్యం ఉన్నప్పుడు చూసేశక్తి నాకు లేకపోతే అది నాకు కనబడదు. మీలో మంచి ఉందనుకోండి నాలో మంచి లేకపోతే మీలో ఉన్న మంచి నాకు కనబడదు మీలో ఏది ఉంటే అదే ఎదుటి వారిలో కనిపిస్తుంది. మీరు వేరు, నేను వేరు అనే వేరుబుద్ధితో ఉన్నంతకాలం మిమ్మల్ని చూసి నేను భయబడతాను, నన్ను చూసి మీరు భయపడతారు. మీరూ నేనూ ఒక్కటే, నాలో మీరు ఉన్నారు, మీలో నేను ఉన్నాను అని బుద్ధితో అర్థం చేసుకోవటంకాదు, అది అనుభవంలోనికి రావాలి. అవగాహన వలన పరమాత్మ అందడు, అనుభవం వలన పరమాత్మ అందుతాడు.

మనందరికీ యజమాని, మన కంట్రోలర్, మన నిజమైన భర్త సర్వేశ్వరుడు. ఆయన మనం ఒక్కటే అనే అనుభవం కలిగేవరకు మనలను దుఃఖం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు. ఈశ్వరుడు మాట వదిలేయండి ఇక్కడ బాహ్యంగా ఉన్న మీ ఆయన మీరు ఒకటి అని అనుకోలేరు. ఆయన మీకు మధ్య తొంభై రహస్యాలు, ఎవరి ప్రోపర్టీ వారిది, ఎవరి మేనేజ్‌మెంట్ వారిది. మీ ఆయన మీరు ఒకటే అని అనుకోనప్పుడు పైనున్న ఆయన అంటే ఈశ్వరుడు మీరు ఒక్కటే అనే భావన ఎలా కలుగుతుంది, ఆ భావన రానేరాదు. నీ దేహయాత్రకు సరిపడ వ్యవసాయమో, ఉద్యోగమో ఏదో ఒక కృషి చేసుకొంటూ, ఏ విషయంలోను అతిగా ఉండకుండా, మధ్యే మార్గంలో ప్రయాణం చేస్తూ మిగతా కాలం అంతా నా నామాన్ని స్మరిస్తూ, నారూపాన్ని ధ్యానిస్తూ, నాలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. అంతకంటే మించిన పని ఏముంది అంటున్నాడు పరమాత్మ. నీవు వేరు, నేను వేరు అని బుద్ధిలో స్థిరపడిపోయింది. నీ బుద్ధికి సార్థకత రావాలంటే నీవు ఏమి చేయాలి అంటే నన్ను నిరంతరం స్మరిస్తూ, నన్ను ధ్యానం చేస్తూ నాలో ఐక్యం అవ్వాలి, అలా ఎప్పుడైతే

ఐక్యం అయ్యావో అప్పుడు నీకు, నాకు బేధం లేదు అని నీకు తెలుస్తుంది. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నన్ను శరణు వేడుకో, నేను ఉన్నాను అని పూర్తిగా విశ్వసించు, నా అనుగ్రహాన్ని సంపాదించటానికి ప్రయత్నం చెయ్యి, నేను ఏదైతే వద్దని చెప్పానో అది మానెయ్యి, నేను చెయ్యమని చెప్పినపని చెయ్యి, చెయ్యకూడనిది చెయ్యటం ఎంతపొరపాటో, చేయవలసిన డ్యూటీ మానెయ్యటం కూడా అంతే పొరపాటు అని చెప్పాడు. భగవంతుడు మీకు కేటాయించిన పనిలో నుండి తప్పించుకొంటే, భగవంతుడు సర్వజ్ఞుడు కదా, రాబోయే జన్మలలో మిమ్మల్ని శరీరమనే కట్రాడుకు కట్టేసి, మీరు తప్పించుకొన్న పనిని వడ్డీతో సహా మీ చేత చేయిస్తాడు, ఈశ్వరుడిది బలీయమైన శక్తి. మనందరం ఏవో అనుకొంటూ ఉంటాము, అనుకొన్నవి అన్నీ జరగటం లేదు. మనమే ఈశ్వరుడైతే అనుకొన్నవి ఎందుకు జరగటం లేదు. కర్మఫలితం జీవుడి చేతిలో లేదు. జీవుడు పని చేయటానికే పనికివస్తాడు కాని ఫలితం ఇచ్చేవాడు పరమేశ్వరుడు. పని నేను చెయ్యాలా, ఫలితం ఈశ్వరుడు ఇస్తాడా అని మొత్తం పని చేయటం మానివేయవద్దు. బాహ్యంగా మీ శరీరానికి ఎన్ని సదుపాయాలు ఉన్నా అవి సైన్సుకి, టెక్నాలజీకు సంబంధించినవి. అవి మీ శరీరాన్ని సుఖపెట్టవచ్చుగాని మీకు శాంతిని ఇవ్వలేవు, మీకు మోక్షాన్ని ఇవ్వలేవు. జ్ఞానం తాలుక అనుభవం ఎప్పడైనా మీ హృదయంలోనే స్ఫురిస్తుంది.

మాకు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి, కర్మేంద్రియాలు ఉన్నాయి వీటిలో ఏ ఇంద్రియం ద్వారా కూడా పొరపాటు జరగకుండా ఉండేలా మమ్మల్ని ఆశీర్వదించు అని కొంతమంది రోజూ సూర్యుడు ఉదయించగానే ఆయనను ప్రార్థిస్తారు. ఇంద్రియాల ద్వారా పొరపాట్లు జరుగుతూ ఉంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు అనుభవంలోనికి రాడు. నువ్వు నేనై ఉన్నాను, అది నీకు తెలియటం లేదు, అందుకే జన్మలు నిన్ను వెంటాడుతున్నాయి. ఆయనే నేను అని నోటితో చెప్పకోవటంకాదు, ఆ అనుభవం హృదయంలో రావాలి. నన్ను చూసి నాకు కోపం రాదు, ద్వేషం రాదు. మిమ్మల్ని చూస్తే నాకు కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. ఇదంతా ద్వైతబుద్ధిలోనుండి వస్తోంది. ఈ ద్వైతబుద్ధిని, వేరుబుద్ధిని నశింపచేసుకోవటానికి మనం చేసే ప్రయత్నంలో ఒక భాగమే ఈ సత్సంగాలు. ఈ జన్మలో అయినా, రాబోయే జన్మలో అయినా ఈ ద్వైతబుద్ధిని అతిక్రమిస్తేనేగాని మనకు మోక్షసుఖం దొరకదు. మీకు చెప్పేది ఏమిటి అంటే మీ దైనందిన జీవితంలో మీ పనులు మీరు చేసుకొంటూ, మీకు చేతనైనంత వరకు ఇతరులకు సహాయం చెయ్యండి. నీవు ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి నీకే వస్తుంది, అది

తెలియక ఇతరులను ఏదో ఉద్ధరించాను అని నీవు అనుకొంటావు. భగవంతుడు మనకు బుద్ధిని ఇచ్చాడు. ఎవడైతే మనకు బుద్ధిని ఇచ్చాడో, ఈ బుద్ధి వెళ్ళి ఆయనలో ఐక్యం అవ్వాలి, అదే మన కడసారి జన్మ. ఒకోసారి భగవంతుడు మనలను కష్టాలకు గురి చేస్తాడు. భగవంతుడు ఇలా చేస్తున్నాడు ఏమిటి అని మనం అనుకొంటాము. మన బుద్ధిలో ఉన్న దోషాలను కక్కించటానికే భగవంతుడు అలా చేస్తాడు. ప్రతీ మనిషికి కొన్ని సంఘటనలు పెట్టి వాడి మనస్సును ఇరుకున పెట్టి నొక్కి దానిలోని దోషాలను బయటకు లాగి మనస్సును శుభ్రం చేస్తాడు. మనలను పవిత్రం చేయటానికే భగవంతుడు ఇవన్నీ చేస్తున్నాడు అని మనకు తెలియటంలేదు. భగవంతుడికంటే మన క్షేమం కోరేవారు ఎవరూ లేరు.

ఈ జీవకోటికి అంతకు పరమేశ్వరుడే భర్త. మన దేహాలతోగాని, మనస్సుతోగాని, ఇంద్రియాలతోగాని సంబంధంలేకుండా అందరి హృదయాలలో ఆయన ఆత్మగా ఉన్నాడు. మీకు లోచూపు కలిగితే, మీరు హృదయంలోనికి వెళ్ళి చూస్తే మీ ఆయన అంటే ఈశ్వరుడు, మీరు ఒక్కటే అని మీకు తెలుస్తుంది. అప్పటివరకు వేరుబుద్ధి ఎవరినీ విడిచిపెట్టదు. మన మనస్సు చలించకుండా ఉండటంకోసం జపం, ధ్యానం, యోగాభ్యాసాలు ఇలా ఏవో ప్రక్రియలు చేస్తున్నాము. రాగద్వేషములు లేకపోతే మన మనస్సును చలించమని అడిగినా అది చలించదు. ఏ హృదయగుహలో అయితే పరమేశ్వరుడు ఉన్నాడో అక్కడకు నిన్ను తోలుకొని పోయేవాడే గురువు. మీకోరికతో, మీ తలంపుతో సంబంధం లేకుండా మీ పని నెరవేర్చేవాడే నిజమైన గురువు. తలంపును కూడా రానివ్వడు, తలంపు రాకపోతే శక్తి వృధా అవ్వదు. మీకు కొన్ని కోరికలు నెరవేరతాయి, కొన్ని కోరికలు ఎంత ప్రయత్నం చేసినా నెరవేరవు. కొన్ని కోరికలు నెరవేరి, కొన్ని కోరికలు ఎందుకు నెరవేరటం లేదో భగవంతుడికి తెలుసు, ఆయన సర్వజ్ఞుడు. ఆ కోరికలు కూడా నెరవేరితే మీరు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పతనమౌతారు అందుకే ఆ కోరికలు నెరవేరకుండా ఆపుచేస్తాడు అంతేగాని మీ మీద ఇష్టం లేకకాదు. ఈ మధ్య ఒక పెద్ద మనిషి ఏమని చెపుతున్నాడు అంటే నేను డబ్బు ప్రసాదించమని భగవంతుడిని అడిగితే ఆయన ప్రసాదించలేదు. అప్పుడు నా ఆర్థిక పరిస్థితి తక్కువగా ఉండేది, పేకాట ఆడేవాడిని. నెమ్మదిగా పేకాట ఆడటం మానేసాను, అప్పుడు భగవంతుడు డబ్బు ప్రసాదించాడు. ముందే ఆయన డబ్బు ప్రసాదించి ఉంటే బాగా పేకాట ఆడి పాడైపోయేవాడిని, అందుచేత పేకాట మానేసాక ఆయన డబ్బు ప్రసాదించాడు, ఇదంతా భగవంతుడి కరుణ అంటున్నాడు. ఈశ్వరుడు ఎందుకు చేస్తున్నాడో, ఆయన ఎందుకు

చేయటం లేదో మనం ప్రశ్నించకూడదు. ఆయన ప్రణాళికను బట్టి అది జరుగుతుంది. ఏ సంఘటన జరిగినా అది మన మంచికోసమే చేస్తున్నాడు అనే విశ్వాసం ఈశ్వరుడిపట్ల మనకు ఉండాలి. లోపల ఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి శరీరం, మనస్సు ఫిట్ అవ్వాలి. మనందరము కావలసిన దానికంటే ఎక్కువగా తింటున్నాము. దాని వలన మనకు అనారోగ్యం, ఇంకొకరు తినే ఆహారం తగ్గిపోతుంది. ఎక్కువ తినటం వలన తమోగుణం వస్తుంది. ఆకలి అనే రోగానికి సరిపడ ఆహారం పెట్టు అని ఆచార్యులవారు చెప్పారు. శరీరం నిలబడటానికి సరిపడ ఆహారం పెట్టు, ఎక్కువ ఆహారం తినటం వలన బలం రాదు, శారీరక ఆరోగ్యం పాడైపోతుంది. శరీరానికి అవసరమైనదే తిను అంతేగాని రుచికోసం ఎక్కువ తినకు. రుచికోసం తినటం మొదలుపెడితే మనస్సు బాహ్యముఖానికి పోతుంది. మనస్సును కూడా ఎంతవరకు ఉపయోగించాలో అంతవరకే ఉపయోగించాలి కాని ఎక్కువ ఉపయోగిస్తే పిచ్చివాడవు అయిపోతావు. వ్యవహారాలలో కూడా అతిగా వెళ్ళకూడదు, మధ్యే మార్గం మంచిది. శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొంటే శరీరం ఉన్నా శరీరం లేనివాడితో సమానము, మనస్సు ఉన్నా మనస్సు లేనివాడితో సమానము.

బయట వారి మీద కేకలు, ఇంట్లో వారి మీద కేకలు వేయటానికి మనకు సిగ్గు ఉండదు. భగవంతుడి నామం గట్టిగా చెయ్యటానికి మనకు సిగ్గు. మనం భగవంతుడిని స్మరించకపోతే ఆయనకు ఏమీ నష్టం లేదు, భగవంతుడి నామాన్ని స్మరించటం వలన మనం పవిత్రులమవుతాము. మన దేహం చనిపోయినప్పుడు కుటుంబ సభ్యులతో, స్నేహితుల తోటి సంబంధం తెగిపోతుంది కాని గురువుతో ఉన్న సంబంధం మాత్రం తెగదు. గురువు మీలో నిజమైన ఆత్మగా ఉన్నాడు. గురువు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిని పొందేవరకు వేటగాడు జంతువును వేటాడినట్లు గురువు జన్మజన్మలకీ మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. గురువు అంటే మీకు ఒకోసారి ఇష్టం ఉండవచ్చు, ఒకోసారి ఇష్టం లేకపోవచ్చు. గురువును మీరు ఎన్నుకొంటే గురువును మారుస్తూ ఉంటారు కాని గురువే మిమ్మల్ని ఎన్నుకొన్నప్పుడు మీరు గురువును మార్చలేరు. గురువే మిమ్మల్ని తన ఒడిలోకి తీసుకొన్నప్పుడు మీరు తరించే వరకూ బాధ్యత గురువుదే. నీ మనస్సును నాకు అర్పించమని భగవంతుడు అడుగుతున్నాడు. మన మనస్సును బాగుచేయటానికే, మనపట్ల దయచూపించటానికే మన మనస్సును అడుగుతున్నాడని తెలియక పోవటం వలన గురువుని, దేవుడిని తిడతాము. మన ఇంట్లో

వారు పరాయివారు కాని గురువు మాత్రం పరాయివాడు కాదు, ఆయన మన హృదయంలో సజీవమైన సత్యముగా ఉన్నాడు. మీరు శరీరాన్ని శుభ్రంగా ఉంచుకొంటున్నారు కదా అలాగే ఏదైనా మాట్లాడేటప్పుడు, పనిచేసేటప్పుడు మీ సంకల్పం శుద్ధిగా ఉండాలని భగవంతుడు చెపుతున్నాడు. మీరు మాట్లాడే మాట వెనకాల, ఆలోచన వెనకాల, పని వెనకాల సంకల్పం ఉంటుంది, ఆ సంకల్పం శుద్ధిగా ఉంటే భగవంతుడి దయ కలుగుతుంది, అంతకంటే మీకు ఏమి కావాలి. మీ సంకల్పం సరిగా ఉంటే నూటికి తొంబై పనులు సక్రమంగానే జరుగుతాయి. పునాదిలో తేడా ఉంటే మేడ ఎంతకాలం ఉంటుంది అలాగే మీ సంకల్పం సరిగా లేనప్పడు మీరు సాధన చేసిన సక్సెస్ అవ్వలేరు. మీ సంకల్పం శుద్ధిగా ఉంటే ఇంపెర్సనల్ బిహేవియర్ వస్తుంది, ఈగోలెస్ బిహేవియర్ వస్తుంది. ఎవడైతే కోరికను, కాలాన్ని జయించాడో వాడు పరమేశ్వరుని స్వరూపాన్ని పొందుతాడు. కొంతమంది మాకు కాలక్షేపం అవ్వటంలేదు అంటారు. అంటే వారు కాలాన్ని జయించలేదు అని అర్థం. మీకు ఆత్మ నిష్ట కుదిరితే వంద సంవత్సరాలు వంద క్షణాల కింద వెళ్ళిపోతాయి అదీ కాలాన్ని జయించటం అంటే.

అహంభావన పోగొట్టుకోవాలి అని పెద్దలు చెపుతున్నారు కాని అది ఎలా పోగొట్టుకోవాలో తెలియటం లేదు అంటున్నారు. మనం ఈశ్వరుడి ప్రణాళికలో ఒకభాగం కింద ఉండాలి కాని వ్యక్తి కనబడకూడదు. మనం ఎంతసేపు వ్యక్తి కనబడటానికి చూస్తాము, దానివలన అహంభావన పెరిగిపోతుంది. మనస్సును కంట్రోలు చేసుకోవటం వలన వచ్చే ఆనందాన్ని తట్టుకోలేకపోతున్నాను మీరేమో ఎయిమ్‌హై అంటున్నారు, గమ్యాన్ని మర్చిపోవద్దు అంటున్నారు, మరి ఏమి చేయమంటారు అని అడుగుతున్నారు. మీరు హైదరాబాద్ మీటింగుకోసం వచ్చారు, మధ్యలో మీ చుట్టాల ఇంటికి, స్నేహితుల ఇంటికి వెళితే వారు ఏమైనా బహుమతులు ఇవ్వవచ్చు అవి చూసి మీటింగుకు రావటం మానెయ్యరు కదా. అలాగే మీరు సాధన చేసేటప్పడు కొన్ని అనుభవాలు కలుగుతాయి, మహిమలు రావచ్చు వాటి దగ్గర ఆగిపోవద్దు. అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ఈ భూమి మీదకు వచ్చాము, వచ్చిన పని మర్చిపోకూడదు. మీ హృదయంలో సత్యం ఉంది. అది మీరై ఉన్నారు. అక్కడకు చేరుకోవటానికి భగవంతుడు శరీరమనే అవకాశాన్ని ఇచ్చాడు, దానిని మనం మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. అసలు మనం చేసే కృషి చేస్తూ ఉంటే, మన సంకల్పం మంచిది అయితే, మనం చేసే ప్రయత్నం డివోటెడ్‌గా చేస్తూ ఉంటే మీరు తొందర పడనక్కరలేదు, కాలం కలిసి వస్తుంది, మీరు పొందవలసింది పొందుతారు. ఏ కాలంలో ఏది జరగాలో

అది జరిగిపోతుంది. అదృష్టమైన, దురదృష్టమైన, శరీరానికి సంబంధించిన చావు అయినా అది రావలసిన టైముకే వస్తుంది. మనం నేను, నేను అంటాము. పండితులకు, పామరులకు, ధనవంతులకు, పేదలకు అందరికీ ఈ నేను అంటేనే ఇష్టం. ఇది మిధ్యానేను. ఈ మిధ్యానేను మీద ఇష్టం తగ్గితేనే గాని నిజమైన నేను తెలియదు. నిజమైన నేనుకు, మిధ్యానేనుకు తేడా చెప్పాలి. అంటే మనిషికూడా నీడ ఉంటుంది కదా అలాగే నిజమైననేనుకి మిధ్యానేను నీడలాంటిది. మనం ఆ నీడను పట్టుకొని నిజమైననేనును విడిచిపెట్టేస్తున్నాము. మిధ్యా నేనును విడిచిపెడితేనే గాని అసలు వస్తువు నీకు ఎరుకలోనికి రాదు. మనలను ఏదైతే పాడుచేస్తోందో అదంటేనే మనకు ఎక్కువ ఇష్టం, దానిని చూసి పొంగిపోతున్నాము, ఆ పొంగును ఆపుచెయ్యి. నేను పుడుతున్నానని, నేను చనిపోతున్నానని శరీరం అనుకోదు, శరీరం లోపల ఉన్న జీవుడు అనుకొంటున్నాడు. అలా అనుకొనేవాడు ఎవడు అని విచారణ చెయ్యి. నీకు ద్వయీభావం ఉండకూడదు. నీ హృదయంలో సత్యం ఉంది. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. నీ దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో బయట గొడవలు కూడా అంతే నిజం. నీ హృదయంలో ఉన్న సత్యంలో స్థిరపడే వరకు నీవు సాధన కొనసాగించు, ఈలోపు సంతోషం వచ్చిందని, దుఃఖం వచ్చిందని, రోగాలు తగ్గించే మహిమలు వచ్చాయని ఇటువంటి చిల్లర గొడవల దగ్గర ఆగవద్దు. నీ గమ్యాన్ని మర్చిపోవద్దు. నీవు శాస్త్రాన్ని అనుసరించి జీవించు. ఏది మంచి ఏది చెడు, ఏది నిత్యం ఏది అనిత్యం అని నిర్ధారణ చేసేటప్పుడు కేవలం నీ బుద్ధి మీద ఆధారపడకు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని నిర్ణయం చేసుకో అని పరమాత్మ చెపుతున్నాడు.

మీకు ఎప్పుడైనా శాంతి వస్తోంది అనుకోండి, దానికి కారణం ఏమిటి అని చూసుకోవాలి. కారణం కనిపిస్తే మీకు వచ్చిన శాంతి నిజంకాదు. మనం భగవంతుడిని ఎలా ప్రేమిస్తే ఆయన దయకు పాత్రులవుతాము అంటే ఆయన దగ్గరనుండి స్వర్గంకాని, ఈలోకానికి సంబంధించిన వైభవం కాని ఏమీ కోరుకోకూడదు, అయినా ఈశ్వరుని పాదాలపట్ల భక్తి, ప్రేమ కనుక ఉంటే ఆయన అనుగ్రహం మన శిరస్సు మీద వర్షింపచేస్తాడు. ఫలానా కారణం వలన మనకు ఈశ్వరుడి మీద ప్రేమ కలిగిందని భౌతికకారణం కనబడితే మీరు అవుటైపోతారు. ఈశ్వరుడి మీద అకారణమైన ప్రేమ, అకారమైన భక్తి ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. ఈశ్వరుని దయను సంపాదించటం కంటే మించినది ఏముంది? మరణానంతర జీవితంలో వచ్చేది అదే. కార్లు, విమానాలు ఇవి అన్నీ మీ శరీరాన్ని సుఖపెట్టే యంత్రాలు, మరణానంతర జీవితంలో

ఇవి ఏమీ మీ కూడా రావు. శరీరం బతికి ఉన్నంతకాలం శరీరానికి ఎన్ని సౌఖ్యాలు కావాలో అన్నీ సమకూర్చుకొనే మనం, మరణానంతరం పనికొచ్చేది ఏమీ చేయొద్దా అనేది ఇక్కడ ప్రశ్న. శరీరం సుఖంగా ఉండటంకోసం డబ్బు ఖర్చు పెట్టి బజారులలో తిరిగి ఇన్ని వస్తువులు కొనుక్కొంటున్నాము కదా మరి మరణానంతర జీవితంలో కూడా సుఖంగా, శాంతిగా ఉండటానికి మనం ఏమి చేయాలి అనే ఆలోచన మనకు రావటం లేదు. మంచి పనులు చేసేవారు కూడా ఏదో పుణ్యం వస్తుందని, స్వర్గలోకానికి వెళదామని ఆలోచించేవారేగాని ఈశ్వరుడిలో ఐక్యం అవ్వటానికి మనం చేసే ప్రయత్నం ఏమీ లేదు. ప్రియ, అప్రియములను విడిచిపెట్టమని భగవంతుడు చెపుతున్నాడు. మీ శ్రేయస్సు కోరేవాడు చెపుతున్నాడు కనుక ప్రియ, అప్రియములను విడిచిపెట్టాలి. వాటిని విడిచిపెట్టేటప్పడు మనకు బాధ కలుగుతుంది ఎందుచేతనంటే ఒకప్పడు అవి మనలను సుఖపెడతాయని వాటిని పెంచుకొన్నాము కనుక ఇప్పడు వాటిని విడిచిపెట్టేటప్పడు మనకు బాధ కలుగుతుంది. ఆత్మజ్ఞానం సంపాదించుకోవటానికి అడ్డువస్తున్నాయి కనుక మనం వాటిని విడిచి పెట్టాలి.

దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు, అది ఏ పనిమీద వచ్చిందో ఆపని చేసుకొని వెళ్ళిపోతుంది. ప్రారబ్దంలో ఉన్న చెడ్డను పాయసం నోట్లో పోసుకొన్నట్లు అనుభవించు. అయ్యోపాపం చెడు ప్రారబ్దం వచ్చినా వీరు చాలా సహనంగా అనుభవిస్తున్నారు, భగవంతుడి సంకల్పాన్ని గౌరవించాలని అనుభవిస్తున్నారు అని ఆయనకు మీ మీద దయ కలిగి రాబోయే జన్మలో అటువంటి ప్రారబ్దాన్ని మీకు ఇవ్వడు అది భగవంతుడు చేసే మేలు. మాకు సందేహాలు వస్తున్నాయి, మాకు భయం వస్తోంది అంటారు ఎవరికి సందేహాలు వస్తున్నాయి? ఎవరికి భయం వస్తోంది? ఈ వికారాలు అన్నీ ఎవరికి వస్తున్నాయి? అని వాడిని విచారణ చేసి బోను ఎక్కించండి, వాడిని తొలగించుకోండి. వాడిని ఎలా తొలగించుకోవాలో నేర్పించేవాడే గురువు. అజ్ఞానం యొక్క చేష్టలు ఎలా ఉంటాయో మీకు తెలియజేసి వాటిలో నుండి ఎలా తప్పకోవాలో మీకు నేర్పించి, అజ్ఞానం నుండి బయటపడేలా చేసేవాడే స్పిరుట్యువల్ గురువు. మంచితనమే జ్ఞానం అంటాడు సోక్రటీసు. లోకం కోసం మంచివారుగా ఉండటం కాదు, ఎదుటివారు చెప్పకోవటంకోసం మంచి వారుగా ఉండటం కాదు, చరిత్రలో వ్రాయించుకోవటానికి మంచివారుగా ఉండటం కాదు, మంచి కోసమే మంచివారుగా ఉండండి. మీకు ఉన్న మంచితనం నిజమైతే ఆ మంచితనమే హృదయగుహాలో ప్రవేశించటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. మాయ ఈశ్వరుడి చేతిలో

ఉంటుంది. మంచికోసమే మంచిగా ఉండేవారికి ఈశ్వరుడు మాయతో చెప్పి మాయ చేత దారి ఇప్పిస్తాడు, అప్పుడు ఈశ్వరుడిలో ఐక్యమవుతాము.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-08, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాంధీగారు జీవితానుభవంలో ఒక ముఖ్యమైనమాట వ్రాసారు. సంతోషాలు వెంటాడుతున్నా, దుఃఖాలు వెంటాడుతున్నా ఈశ్వరుడికి మనం ఎంత శరణాగతి చేస్తే అంత శాంతిని, సుఖాన్ని పొందుతున్నట్లు గ్రహిస్తున్నాను అని తన జీవితంలో నేర్చుకున్న పాఠాలలో గాంధీగారు వ్రాసుకొన్నారు. జీవులలో బహుత్వం ఉంది, దేవతలలో బహుత్వం ఉంది కాని ఈశ్వరుడిలో బహుత్వం లేదు. రాముడు, కృష్ణుడు, శంకరుడు, అల్లా, యెహోవా ఇలా అనేక రూపాలలో ఉన్నా భగవంతుడు ఒక్కడే, మతాలను బట్టి పేర్లు మారుతున్నాయి కాని ఉన్నవాడు ఒక్కడే. నేను కోరికలను నెరవేర్చుకోవటానికి ఈ భూమి మీదకు రాలేదు, ఏ పరమాత్మ అయితే నన్ను ఈ భూమి మీదకు పంపాడో ఆయన సంకల్పాన్ని నెరవేర్చటానికి ఈ భూమి మీదకు వచ్చాను అన్నాడు ఏసు. సముద్రానికి భిన్నంగా బుడగలు లేవు. ఈశ్వరుడికి భిన్నంగా జీవులు లేరు. మనందరం ఈశ్వరుడిలో నుండే వచ్చాము, ఈశ్వరుడిలోనే జీవిస్తున్నాము, ఈశ్వరుడిలోనే లయం అయిపోతాము. భక్తిలో ద్వైతం ఉంది కాని శరణాగతిలో ద్వైతం లేదు. భక్తిలో నీవు ఉంటావు, భగవంతుడూ ఉంటాడు కాని శరణాగతిలో జీవుడు ఉండడు, భగవంతుడే ఉంటాడు, ఆయన సంకల్పమే మన సంకల్పం. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా జరిగేది ఈశ్వర సంకల్పమే. ఈశ్వర సంకల్పానికి ఎదురు ఈదటం అంటే రోడ్డు రోలరు కింద తలకాయ పెట్టటమే. జీవులు ఎవరూ స్వతంత్రులు కాదు, సృష్టి అంతా ఈశ్వరుని స్వాధీనంలో ఉంది. భగవాన్ తల్లికి చెప్పిన మొదటి సందేశం ఇదే. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధం ననుసరించి ఆడిస్తున్నాడు, జరుగవలసింది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసిననూ జరుగనే జరుగదు అని చెప్పారు. ఇది నోటితో చెప్పకోవటం తేలిక, అనుభవానికి రావాలంటే చాలా అభ్యాసం అవసరం. ఈ శరీరమే నేను, ఈ శరీరం నాది అనే జీవుడికే సంతోషాలు, దుఃఖాలు వస్తాయి. ఈ సంతోషాలు, దుఃఖాలు, స్వర్గం, నరకం, అదృష్టం, దురదృష్టం వీటినన్నింటిని అనుభవించేవాడు జీవుడే. నేను, నాది అనే జీవుడు ఈ శరీరాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతే అప్పుడు ఎవరైనా